# ఆనందో



# బ్రహ్మ

## నెలనెలా నవ్వుల విందు

– సాయి బ్రహ్మానందం గొర్తి

## ఎంత దూరం?

ఓ అతి తెలివైన భక్తుడు దేముడి కోసం తప్పస్సు చేయడం మొదలు పెట్టాడు. అతని తప్పస్సుకి మెచ్చి, దేముడు ప్రత్యక్షమయ్యాడు. ఆనందంతో తబ్బిబ్బయ్యి, ఆ భక్తుడు "దేముడా! స్వర్గం ఇక్కడనుండి ఎంత దూరం?" అని అడిగాడు. "ఏముంది? కొన్ని వందల వేల కోట్ల యోజనాల దూరం ఉంది!" అన్నాడు దేముడు.

"అంత దూరం నుండి రావాలంటే ఎంత టైం పడుతుంది?"

"ఏముంది? క్షణంలో వచ్చాను..."

"క్షణంలో వచ్చావా? క్షణం అంటే?..." అమాయకంగా అడిగాడు భక్తుడు.

"మా లెక్కలో వందల వేల కోట్లు అంటే ఒకటితో సమానం!"

"అలాగా? అయితే నాకు అంతగా అశ లేదు. ఒక్క పైసా ఇయ్యి చాలు !" అతి తెలివి ప్రదర్శించాడు భక్తుడు.

"ఓస్, అంతేనా! ఒక్క క్షణంలో ఇస్తాను? అంటూ దేముడు మాయ మయ్యాడు.

## కష్టాలు



అప్పలరాజు ప్రతీ రోజు ఒకే హొటల్లో రోజూ తినడానికి వెళ్ళేవాడు. తింటున్నంత సేపూ, ఆ ఫుడ్ ఎంత చెత్తగా ఉందో ఏకరువు పెట్టేవాడు.
"రోజు రోజుకీ మరీ అధ్వాన్నంగా ఉంటోంది! ఉప్పుంటే, కారం ఉండదు, కారముంటే పులుపుండదు. ఈ హొటల్లో తినడం మంటే ఓ పెద్ద శిక్షే! ఛీ ! ఛీ! దరిద్రంగా ఉంది !!" అంటూ పదిమందికీ వినిపించేలా తిట్టేవాడు.
అప్పలరాజుని ఓ వ్యక్తి ప్రతీరోజూ గమనిస్తూనే ఉన్నాడు.
ఓ రోజు ఉండ బట్టలేక, "ఏం సార్! గత నెలరోజులుగా మిమ్మల్ని ఇదే హొటల్లో ప్రతీరోజూ చూస్తున్నాను. ఫుడ్ తింటున్నంత సేపూ తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతూ, తింటున్నారు. భలే విచిత్రంగా ఉంది. మీకు అంతగా నచ్చకపోతే, ఇంకో హొటల్ కెళ్ళి తినచ్చు కదా? " అని ప్రశ్నించాడు.
"ఏం చెయ్యమంటారు చెప్పండి? నా ఖర్మ. ఈ హొటల్లో తిండి తిని నెల్లాళ్ళల్లో పది కిలోలు వెయిట్ కోల్పోయాను... మీకు వేళాకోళంగా ఉందా?" చికాకు పడ్డాడు అప్పలరాజు.
"అయినా ఇక్కడే తింటున్నారా? చాలా ఫన్నీగా ఉంది.." అవతల వ్యక్తి నవ్వు ఆపుకోలేక పోయాడు.
"ఏం చెయ్యమంటారు? ఇప్పటికే ౧౦ కిలోలు బరువు తగ్గాను.. ఇంకో ౨౦ కిలోలు తగ్గాలి....నా కష్టాలు నావి..." అప్పల రాజు నెత్తి బాదుకున్నాడు.

## జుర్మానా...



ఓ జేబు దొంగని కోర్ట్‌లో విచారణకి హాజరు పరిచారు.

" ఈ జేబుదొంగ పాల్పడిన నేరాలు అన్నీ సాక్షాధారాలతో నిరూపణ అయ్యాయి. కాబట్టి ఇతనికి పాతిక వేలు జుర్మానా , పదేళ్ళు జైలు శిక్ష విధించడమయినది. ఒకవేళ జుర్మానా కట్టలేకపోతే, ఈ శిక్ష ఇంకో అయిదేళ్ళు పొడిగించ బడుతుంది..." జడ్జి గారు తీర్పిచ్చారు.

"సార్! నా దగ్గర అంత మొత్త ం లేదు.. జుర్మానా కట్టలేను. కానీ నన్నో పదినిమిషాలు ఈ జనం మధ్యకి వెళ్ళే అనుమతి ఇవ్వండి.. క్షణంలో మీ జుర్మానా చెల్లిస్తాను " అంటూ జేబుదొంగ అమాయకంగా అడిగాడు.

## ట్రీట్‌మెంట్ ...



"డాక్టర్ ! నాకు నిజంగా న్యూమోనియా వచ్చిందంటారా? మలేరియా వస్తే న్యూమోనియా ట్రీట్‌మెంట్ చేయడం వల్ల అనేక మంది చనిపోతున్నారని, ఆ మధ్య పేపర్లో చదివాను..- ఇది నిజమేనా ?" భయం భయంగా అడిగాడు ఓ పేషంట్.

"నువ్వేం కంగారు పడకు! నేను న్యూమోనికి ట్రీట్‌మెంట్ చేస్తే న్యూమోనియా వల్లే పోతారు. మలేరియా వల్ల పోయే ఛాన్సే లేదు !!" అభయ మిచ్చాడా డాక్టర్

## ప్లీజ్!



పాపారావు, పార్వతీ మొగుడూ పెళ్ళాలు. ఇద్దరికీ క్షణం పడేది కాదు. ప్రతీరోజూ గిల్లి కజ్జాలు పెట్టుకొనే వారు. చివరకి ఇద్దరూ విడాకులు తీసుకొని, వేరు వేరుగా అదే వీధిలో ఉంటున్నారు. ఓ రోజు కారులో పాపారావు వెళుతున్నాడు. అతని కెదురుగా పార్వతి కారులో ఎదురుపడింది. పాపారావుని చూసి రోడ్డు కడ్డంగా కారు ఆపి, తీరిగ్గా వార పత్రిక చదవడం మొదలు పెట్టింది. పాపారావుకి ఒళ్ళు మండిపోయింది. కానీ ముందుకెళ్ళ లేడు, వెనక్కెళ్ళ లేడు. అ వీధి ఇరుకు వీధి ! కోపంతో ఊగిపోయాడు... కానీ ఏమీ చేయలేడు.

“పార్వతీ! నేనూ కూడా సీరియల్ మిస్సయ్యాను. నువ్వు పుస్తకం చదవడం అయ్యాక నాకు ఓ సారి ఇవ్వవూ?“ అంటూ నవ్వుతూ అడిగాడు.

## యమ తీర్పు



ఓ రాజకీయ నాయకుడు చచ్చి పై లోకాలికెళ్ళాడు. యమధర్మ రాజు ఒక్కొక్కరి చిట్టాయే తీస్తున్నాడు. ముందు ఓ ప్రభుత్వోద్యోగి వంతు వచ్చింది. “యమధర్మ రాజా ! ఇతను ప్రభుత్వోద్యోగి ! అయిన దానికీ, కాని దానికీ లంచాలు తీసుకొనేవాడు.“ చిత్రగుప్తుడు చెప్పాడు. “అయితే ఇతన్ని సలసల కాగుతున్న నూనెలో వేయండి...నరకానికి పంపండి..“ అంటూ యమధర్మ రాజు తీర్పిచ్చాడు. తరువాత ఓ వ్యాపారి వంతు వచ్చింది.

"ఇతను కల్తీ చేసి వస్తువులు అమ్మాడు ప్రభూ! " చిత్రగుప్తుడు చెప్పాడు.

"ఇతన్ని నిప్పుల్లో వేయండి..." యమధర్మ రాజు ఆజ్ఞ ఇచ్చాడు.

చివరగా రాజకీయ నాయకుడి వంతు వచ్చింది.

"అయ్యా! ఇతను రాజకీయ నాయకుడు. మర్డర్లూ, మాన భంగాలు చేసి, ప్రతీ అయిదేళ్ళకోసారి ప్రజల్ని మోసగిస్తూ, ప్రజల సొమ్ము కాజేసే వాడు.." చిత్రగుప్తుడు నేరాల చిట్టా విప్పాడు.

"అలాగా! అయితే ఇతన్ని స్వర్గానికి పంపండి..." అంటూ యమధర్మ రాజు ఆజ్ఞా పించాడు.

ఇది చూసి ప్రభుత్వోద్యోగీ, వ్యాపారీ ఖిన్నులయ్యారు.

"యమధర్మ రాజా ! ఇది చాలా అన్యాయం ! మేం చేసిన చిన్న చిన్న వాట్లకే అంత పెద్ద శిక్షలు వేసి, మర్డర్లూ, మానభంగాలూ చేసిన ఇతనికి స్వర్గమా? ఇది అన్యాయం! ఘోరం!!.." అంటూ నెత్తీ నోరూ బాదుకున్నారు.

"కంగారు పడకండి... ఈ రాజకీయ నాయకుడు స్వర్గంలో అతని భార్యతో కలసి ఉంటాడు.." తాపీగా నవ్వుతూ చెప్పాడు యమధర్మ రాజు.

లాఫింగ్ గ్యాసు వేస్తే తప్ప



ఉపయోగం లేదు!